క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్

సత్తుపల్లిటౌన్: బాల్యం నుంచే విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని 6వ అదనపు జిల్లా మారగాని శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీనారాయణ జూనియర్ కళాశాలలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కోర్టులు, వాటి పరిధిలు, బాల్య వివాహ చట్టాలు, బాల కార్మిక చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు ఎన్‌సీహెచ్ రామకృష్ణమాచార్యులు, ప్రిన్సిపాల్ నవకుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, సుధీర్, ఆంజనేయులు, రాంబాబు, వాసు పాల్గొన్నారు.

పత్తి సాగులో మెళకువలపై అవగాహన



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏఓ వినయ్‌కుమార్

బోనకల్: మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో పత్తిపంటలను శనివారం ఏఓ వినయ్‌కుమార్ పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. తెగులు సోకిన పత్తి మొక్కలను పీకి పత్తి పంటకు దూరంగా వేయాలన్నారు. కాపర్ హైడ్రాక్సైడ్ 2 గ్రాములు, లీటర్ నీటికి కలిపి ఆ మిశ్రమాన్ని మొక్క మొదలు భాగం తడిచే విధంగా వేయాలన్నారు. 13.0.45(పొటాషియం నైట్రేట్) వంటి సూక్ష్మ పోషకం 5 గ్రాములు, లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్యక్రమంలో ఏఈవో బంధం రజిత తదితరులున్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

చింతకాని: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి ఆల్తాఫ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో క్షయ వ్యాధిగ్రస్తులకు ఖమ్మం యలమద్ది ఆస్పత్రి వారు అందజేసిన న్యూట్రిషన్ కిట్లను శనివారం పంపిణీ చేశారు. క్షయ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలను పాటిస్తూ మందులను క్రమం తప్పకుండా వాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారావు, టీబీ సూపర్‌వైజర్ ఇమామ్, ల్యాబ్ టెక్నీషియన్ సైదులు, వైద్యసిబ్బంది శ్రీనివాసరావు, సుమలత, ఆశ కార్యకర్త ఉమ, తదితరులు పాల్గొన్నారు.

కోరిన కోర్కెలు తీర్చే..

అద్భుత వేంకటేశ్వరుడు



అద్భుత వేంకటేశ్వరస్వామి ఆలయం



పద్మావతి అమ్మవారి దేవాలయం



వీరభద్రుడి ఆలయం

- నాచారంలో వెలసిన స్వామివారు
- రాష్ట్రం నలుమూలల నుంచి వస్తున్న భక్తులు
- జిల్లా తిరుమలగా ప్రసిద్ధి

భక్తుల కోరిన కోర్కెలు తీర్చే ప్రత్యక్షదైవం.. మండలంలోని నాచారంలో వెలసిన అద్భుత వెంకటేశ్వరుడు. ఖమ్మం జిల్లా తిరుమలగా చెప్పుకునే ఈ ఆలయానికి భక్తులు రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చి మొక్కులు చెల్లించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు.

ఏన్కూరు: మండల పరిధిలోని రేపల్లెవాడ - నాచారం గ్రామాల మధ్య ఉన్న గుట్టను.. వీరభద్రుని గుట్ట అంటారు. ఈ గుట్ట కింద ఉన్న వీరభద్ర స్వామిని స్థానికులు ఆరాధిస్తారు. ఆ స్వామి తపస్సు ప్రభావం వలన శ్రీనివాసుడు లక్ష్మీ సమేతుడై ఈ గుట్టపై ఆవిర్భవించారని ప్రతీతి. స్వామి వారు ఆవిర్భంచిన తీరు కూడా అద్భుతమే.

స్వామివారి రాక ఇలా..

2002 జూన్ 7వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో వీరభద్రుడి గుట్టపై నుంచి ఒక శిల విచిత్ర ధ్వనులు చేసుకుంటూ జారుకుంటూ వచ్చి గుట్ట మధ్యభాగంలో తూర్పు ముఖంగా ఆగింది. 10 టన్నులకు పైగా బరువుతో ఉన్న 24 అడుగుల పొడవైన ఆ శిల జారుతున్నప్పుడు వేదమంత్ర ఘోష, జే గంటలు, మంగళవాయిద్యాలు వినిపించినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఆ శిల కింద శ్రీవారి పాదాలు, శంఖు చక్రాల ముద్రలు కనిపించాయి. ఆ తర్వాత నెల రోజులకు గుట్టపై ఉన్న మరొక శిల కళ్యాణ తిలకాన్ని దిద్దినట్లు పద్మాసనంపై కూర్చున్న అమ్మవారి వలే జారుకుంటూ వచ్చింది. నెల రోజుల వ్యవధిలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరులిద్దరూ ఇక్కడ వెలిశారు.

అద్భుత వేంకటేశ్వరుడిగా నామకరణం..

ఈ ప్రాంతానికి వచ్చేసిన శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్నజీయర్ స్వామి.. స్వామివారిని దర్శించుకొని శ్రీ అద్భుత వేంకటేశ్వర స్వామిగా నామకరణం చేశారు. త్వరలోనే ఈ ప్రాంతం దివ్యక్షేత్రంగా మారుతుందని ఆయన తెలిపారు. అనంతరం ఈ ఆలయాన్ని దేవాదాయశాఖ వారు స్వాధీనం చేసుకొని రూ.54 లక్షలతో ఆలయ నిర్మాణం, అభివృద్ధి పనులు చేపట్టారు. దాత కాంట్రాక్టర్ మొగిలి శ్రీనివాసరెడ్డి రూ.కోటితో ఆలయం అభివృద్ధిలో పాలుపంచుకున్నాడు. పద్మావతి అమ్మవారి ఆలయం ఎదుట పెద్ద పుట్ట ఉంది. అందులోని నాగరాజు భక్తులు పూజలందుకుంటున్నారు.

ఆదాయ వివరాలిలా..

నాచారం దేవస్థానం ఆదాయం ప్రతి ఏడాది హుండీ, తలనీలాలు, కొబ్బరికాయలు, అర్చన టికెట్ల ద్వారా రూ.23 లక్షలు వస్తుంది. స్వామివారు వెలసిన రోజు, పద్మావతి అమ్మవారు వెలసిన రోజులలో ప్రతి సంవత్సరం ప్రత్యేక పూజలు, అన్నదానలు, భక్తబృందం వారిచే సంకీర్తనల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తు ఉంటారు. కొండ క్రింద ఉన్న కమ్మవారి కల్యాణమండపంలో శుభకార్యాలు జరుగుతు ఉంటాయి.



కొండపైకి వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు

కొండపైకి వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు..

వేంకటేశ్వరస్వామి దర్శించుకొనేందుకు కొండపైకి వెళ్లేందుకు ఘాట్‌రోడ్డు ఉంది. ఈ రోడ్డును రూ.2 కోట్లతో త్వరలో సీసీ రోడ్డుగా మార్చనున్నారు. భక్తులు కాలినడకన వెళ్లేందుకు మెట్లు ఉన్నాయి.

శనివారం ప్రత్యేక పూజలు..



నాచారంలో వెలసిన అద్భుత వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తుల శనివారం అధిక సంఖ్యలో వస్తారు. ప్రతి రోజు గోత్రనామార్చాన, అష్టోత్తర పూజలు జరుగుతాయి. దేవాదాయ శాఖ, మొగిలి శ్రీనివాసరెడ్డి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.

– నల్లాని చక్రవర్తులు శ్రీనివాసాచార్యులు, పూజారి

వీధులు శుభ్రం చేస్తున్నారా..?

- మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే రాగమయి



సత్తుపల్లి : ద్వారకాపురి కాలనీలో సమస్యలు ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి: పారిశుధ్య కార్మికులు ప్రతిరోజు శుభ్రం చేస్తున్నారా, తాగునీరు వస్తోందా అని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ఆరా తీశారు. మార్నింగ్‌వాక్‌లో భాగంగా శనివారం ఆమె ద్వారకాపురి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ద్వారకాపురికాలనీలోని మెరక ప్రాంతం వాసులు తాగునీరు రావటం లేదని చెప్పగా సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహకు సూచించారు.

కేటీఆర్ తీరు మార్చుకోవాలి..

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై విమర్శలు చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్ ఇకనైనా తీరు మార్చుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే, టీపీసీసీ జనరల్ సెక్రటరీ డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. స్థానిక క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రుల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారంటూ చేసిన విమర్శలు సరికాదని, బీఆర్ఎస్ హయాంలో ఏం జరిగిందో అందరికీ తెలుసునన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై తప్పుడు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు శివవేణు, గాదె చెన్నారావు, నాయకులు చల్లగుళ్ల నర్సింహారావు, ఎం.డీ.గఫార్ ఖాన్, ఎం.డీ.కమల్‌పాషా, పద్మజ్యోతిరెడ్డి, తోట సుజలరాణి, సందీప్‌గౌడ్, దామెర రమేష్, కుమారి, పింగళి సామేలు, మారుతి సూరిబాబు, బాబురావు, దొడ్డాకుల గోపాలరావు, నారాయణవరపు శ్రీనివాసరావు, చల్లగుండ్ల కృష్ణయ్య, నాగుల్ మీరా పాల్గొన్నారు.

ఇంటికే కల్యాణలక్ష్మి చెక్కు..

కల్లూరురూరల్: కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఇంటి వద్దే చెక్కుల పంపిణీని ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించారు. కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం పర్యటించిన ఆమె లబ్ధిదారులకు చెక్కులు అందజేశాక ఇందిరమ్మ గృహాల నిర్మాణాలను పరిశీలించారు. తహసీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, మార్కెట్ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, ఏనుగు సత్యంబాబు, మట్ట రామకృష్ణ, భాగం ప్రభాకర్, ఆలకుంట నర్సింహారావు పాల్గొన్నారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి



మధిర: నాగులవంచ సొసైటీలో ఎరువులను పరిశీలిస్తున్న మధిర ఏడీఏ విజయ్‌చంద్ర

మధిర: ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచాలని మధిర వ్యవసాయ సహాయ సంచాలకుడు విజయ్ చంద్ర పేర్కొన్నారు. మండలంలోని నాగులవంచ, చింతకాని సొసైటీల్లోని ఎరువులను శనివారం తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువులకు కృత్రిమ కొరతను సృష్టిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ ధరకు విక్రయించి, బిల్లులు ఇవ్వాలన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ సందర్భంగా సొసైటీల్లోని ఎరువుల స్టాక్ రిజిష్టర్లు, సేల్ రిజిష్టర్లను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మానస, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలి

చింతకాని: రైతులు ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని మధిర ఏడీఏ విజయ్‌చంద్ర అన్నారు. శనివారం మండలంలోని నేరడ గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలను సాధించవచ్చని, దాని ప్రయోజనాలు, ప్రభుత్వ సబ్సిడీల గురించి తెలిపారు. నానో యూరియా వాడకం వలన మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, ఖర్చు తక్కువ అవుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఏఓ మానస, వ్యవసాయ విస్తరణాధికారి రాము, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అతివలకు అండగా 'ఇందిరా మహిళా శక్తి'



మహిళలకు రుణాల చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు

వైరా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తారని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. వైరా వ్యవసాయమార్కెట్ యార్డ్‌లో శనివారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలను కోటీశ్వరులు చేయాలనే లక్ష్యంతో వడ్డీలేని రుణాలు ఇస్తూ వారిని వ్యాపారవేత్తలుగా చేయాలని డ్వాక్రా సంఘాలను, మెప్మా, ఐకేపీ లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అనంతరం వివిధ డ్వాక్రా సంఘాలకు మంజూరైన రుణాలకు సంబంధించిన చెక్కులు అందజేశారు.

బిర్యానీకి అమ్ముడు పోయేవారు కాదు..

తెలంగాణ ప్రజలు బిర్యానీకి అమ్ముడుపోయే రకం కాదని రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డిని, బీఆర్ఎస్ నాయకులు విమర్శిస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అడిషనల్ కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, డీఎస్‌ఓ శైలజ, నాయకులు బొర్రా రాజశేఖర్, పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ టీ-స్టాల్ ప్రారంభం



ప్రారంభిస్తున్న ఏపీఎం సురేంద్రబాబు

బోనకల్: మండలంలోని చిరునోముల క్రాస్ రోడ్డు వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో స్త్రీ టీ-స్టాల్‌ను ఐకేపీ ఏపీఎం సురేంద్రబాబు శనివారం ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు స్వశక్తితో ఎదిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

సత్తుపల్లిటౌన్: ఏడు రకాల ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను రక్షించేందుకు 9రకాల వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా వేయించాలని గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్.అవినాష్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం జాతీయ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. 0-5 సంవత్సరాలలోపు చిన్నారులకు హెపటైటిస్-బి, పోలియో, మిజిల్స్, బీసీజీ, పెంటా వాలెంట్, గర్భిణులకు టీటీ ఇంజక్షన్లు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయకుమారి, ఏఎన్ఎంలు మంజుల, రమాదేవి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సత్తుపల్లిరూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థినులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



తల్లాడ: ర్యాలీగా వెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

తల్లాడ/కల్లూరు/పెనుబల్లి/వేంసూరు: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్, ఖమ్మ జిల్లా ముగ్గురు మంత్రుల పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నాయకులు శనివారం కేటీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ముందుగా తల్లాడ పట్టణంలో బస్టాండ్ సెంటర్‌లో, కల్లూరులో, పెనుబల్లిలో, వేంసూరులోని మర్లపాడు రింగ్ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. సీఎం, మంత్రులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తల్లాడ, వేంసూరు మండలాల అధ్యక్షులు కాపా సుధాకర్, కాసరి చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, నాయకులు పాల్గొన్నారు.

విజయ విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

కొణిజర్ల: మండలంలోని అమ్మపాలెం పంచాయతీ పరిధిలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సర విద్యార్థులతో పాటు బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ నిర్వహించారు. కళాశాల ప్లేస్‌మెంట్స్, ట్రెయినింగ్ డైరెక్టర్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా తరుణమ్ ఆధ్వర్యంలో.. ఏఐ ఇన్‌స్పైర్ ప్రైవేట్ లిమిటెడ్ బెంగళూరు కంపెనీ వారు నిర్వహించిన ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో.. బీటెక్ పూర్తిచేసిన 35మంది విద్యార్థులకు, బీటెక్ ఫైనల్‌ఇయర్ 150మందికి పైగా విద్యార్థులకు ప్రముఖ ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని కళాశాల యాజమాన్య తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా తరుణమ్, డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఏఓ డాక్టర్ ఫరీద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

బీమా సదుపాయం కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ప్రభాకర్

ఎర్రుపాలెం: ప్రభుత్వం పేదలకు, వ్యవసాయ కూలీలకు బీమా సదుపాయం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, వ్యవసాయకార్మిక సంఘం మండల కార్యదర్శి గామాసు జోగయ్య డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని నర్సింహాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు షేక్ ఇమాంబీ, గంధసిరి కృష్ణవేణి, బంగారమ్మ, త్రివేణి, శ్రీనివాసరావు, నాగమణి, పద్మ, కుమారి తదితరులున్నారు.

'జూనియర్ కళాశాలలో సరదా శనివారం'



కళాశాలలో మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

వైరా: వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం సరదా శనివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల మానసిక, ఆరోగ్య, శారీరక విషయాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాశాల సిబ్బంది.. కళాశాల ఆవరణ శుభ్రంచేసి వనమహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి, ఏజీఎంసీ నక్కా ప్రసాద్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో వనమహోత్సవం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సీహెచ్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరై బాలికలతో కలిసి కళాశాల ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజని, వైస్ ప్రిన్సిపల్ నవ్య, వివిధ విభాగాల కోఆర్డినేటర్లు, పాల్గొన్నారు.

శంకుస్థాపన

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం, గట్ల గొరారం, సత్యనారాయణాపురం గ్రామాల్లో శనివారం ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లకు మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీను, పిచ్చిరెడ్డి, కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, ఆత్మ ప్రసాద్, సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి, మేడేపల్లి, న్యూలక్ష్మీపురం తదితర గ్రామాల పాఠశాలల్లో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షులు కట్టా శేఖర్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అసోషియేట్ అధ్యక్షుడు అమృతకుమార్, రాష్ట్ర కార్యదర్శి సంజీవరావు, జిల్లా కార్యదర్శి ముజాఫర్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గురవయ్య, సాంబశివరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



మధిర : మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మధిర/కల్లూరురూరల్/కొణిజర్ల: వైరాలో ఈనెల 24న జరగనున్న టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు కోరారు. మధిరలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పాగి బాలస్వామి, టీ.కే.ప్రసన్నన్, కాకరపర్తి శ్రీనివాసరావు, మధు, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కల్లూరు, కొణిజర్లలో జరిగిన సమావేశాల్లో జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.కే.ఖాదర్‌బాబా, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మోటపోతుల బాబురావు మాట్లాడారు. నాయకులు పగడాల మధు, తుమ్మలపల్లి మంగపతిరావు, ఎం.శ్రీనివాసరావు, పాపగంటి నాగేశ్వరరావు, కె.రవికుమార్, కె.రాము పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

సత్తుపల్లి: సత్తుపల్లిలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తుండగా పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. ద్వారకాపురి కాలనీలో సింగపాము విజయమ్మ నివాసంలో వ్యభిచారం నడుస్తోందనే సమాచారంతో శనివారం ఎస్సై వీరప్రసాద్ తనిఖీ చేశారు. చింతల సూర్యకుమారి అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తూ యజమానికి సైతం డబ్బు ఇస్తున్నట్లు తేలగా అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీహరి తెలిపారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

వేంసూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని అకువీడుకు చెందిన సాహెబ్(55) మండలంలోని మర్లపాడులో బస్తాలు కుట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనను శుక్రవారం ఏపీలోని చాట్రాయి మండలం చనుబండకు చెందిన గౌతమ్ ద్విచక్ర వాహనం ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. దీంతో సాహెబ్‌ను సత్తుపల్లి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

పోలీస్‌స్టేషన్ నుంచి పరారీ ?

కల్లూరు: చోరీ కేసులో విచారణకు తీసుకొచ్చిన వ్యక్తి కల్లూరు పోలీస్‌స్టేషన్ నుంచి శుక్రవారం రాత్రి పరారైనట్లు తెలిసింది. పలు ప్రాంతాల్లో గొలుసు చోరీలకు పాల్పడ్డాడనే అనుమానంతో ఓ వ్యక్తిని

సంక్షిప్త సమాచారం

ఖమ్మం నుంచి కల్లూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం. ఆయన పోలీసుల కళ్లు గప్పి పరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఎస్‌ఐ హరితను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని బదులివ్వడం గమనార్హం.

హామీల అమలు మరిచిన ప్రభుత్వం

కారేపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.నాగేశ్వరరావు అన్నారు. శనివారం కారేపల్లి మండలం బొక్కలతండాలో వ్యవసాయ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమి లేని పేదలకు ఇందిర్మ ఆత్మీయ భరోసా రూ.12వేలు, మహాలక్ష్మి పథకం మహిళలకు రూ.2,500లు ఊసేత్తడం లేదని, పెన్షన్‌ల పెంపుపై ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, వినోద్, బాలు, ముఠామేస్త్రి, పిచ్చమ్మ, పాల్గొన్నారు.

బైబిల్‌ను దహనం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కల్లూరు: బైబిల్ దహనం చేయడం నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు, బిషప్ ఎండీ సుదర్శనం శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. మతోన్మాదంతో కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

తల్లాడ: మండలంలోని నారాయణపురంలో శనివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 55మందికి బీపీ, షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. వారిలో ఇద్దరికి బీపీ, షుగర్ ఉన్నట్లు తేలడంతో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికెళ్లి తగిన పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ బెల్లంకొండ ఆంజనేయులు, డీసీలు వెంటేశ్వర్లు, రాజశేఖర్‌రెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సరుకులు వితరణ

కల్లూరు: కల్లూరు పట్టణంలోని కప్పలబంధం రోడ్‌లో నివాసముంటున్న మాచర్ల కృష్ణ ఇటీవల మృతి చెందగా.. ఆ కుటంబానికి కాంగ్రెస్ నాయకుడు యాసా శ్రీకాంత్ ఆధ్వర్యంలో వంట సరుకులు శనివారం వితరణగా అందించారు. 100 కేజీల బియ్యం, 5 కేజీల కందిపప్పు, 10 కేజీల ఉల్లిగడ్డలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్, రాంబాబు, ప్రవీణ్, ఖాసీమ్, రామారావు, రాంబాబు, బాజీ, యాకోబ్ పాష, సత్యనారాయణ, కోటేశ్వరరావు, రాము పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను సాధించాలి

పెనుబల్లి: విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయనంద్ అన్నారు. శనివారం మండలంలోని అడవి మల్లెల ప్రభుత్వం గురుకుల పాఠశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి భవిష్యత్‌లో మంచి స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ, ప్రభాకర్, ప్రిన్సిపాల్ విజయ కుమారి, కోటేశ్వరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, రామారావు, మాధవరెడ్డి, రాజా, ఆనంద్‌రావు, కిషోర్, పోతురాజు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

మధిర: నాగవరప్పాడు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రంగారావు మాట్లాడుతూ.. విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని అందజేసిన బత్తుల కృష్ణను అభినందించారు. ప్రతి ఏడాది బత్తుల కృష్ణ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ నాగమణి, మాజీ సర్పంచ్ ఎంవిఎస్ఎన్ ప్రసాద్, గ్రామ పెద్దలు తోక రామారావు, వెంకయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి చేయూత

తల్లాడ: మండలంలోని నూతనకల్ గ్రామంలో వెంగన్నపేట రోడ్ నుంచి వాగులోకి వెళ్లే దారి చెత్త, కంప పెరిగి అధ్వానంగా తయారైంది. పలువురు రైతులు గ్రామానికి చెందిన రైతు కల్యాణపు వెంకటయ్య దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రోడ్డుకు మట్టి తోలించి, కంప చెట్లను కొట్టించి, ట్రాక్టర్ డోజర్‌తో చదును చేయించి తన మంచి మనసు చాటుకున్నారు. దీంతో రైతులకు, గ్రామస్తులకు ఆ రోడ్డుపై ప్రయాణం సౌకర్యవంతంగా మారింది. ఈ కార్యక్రమంలో వీరబాబు, కపీర్, వీరభద్రం పాల్గొన్నారు.

ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలకు ఎల్ఈడీ ప్రొజెక్టర్ వితరణ

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి ఆశ్రమ పాఠశాలకు ఎల్ఈడీ ప్రొజెక్టర్‌ను బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్, పూర్వ విద్యార్థి ధరావత్ నరేష్ శనివారం విరాళంగా అందజేశారు. పూర్వ విద్యార్థులు కిరణ్‌కుమార్, నరేష్, ఉపాధ్యాయులు బానోత్ రాందాస్, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

బోనాల వేడుకలు



ఏన్కూరు: బోనాల వేడుకలో పాల్గొన్న విద్యార్థులు

బోనం అనగానే భోజనం అని అర్థం.. దేవునికి సమర్పించే నైవేద్యంగా దీనిని భావిస్తారు. తెలంగాణ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే బోనాలు పండుగను శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించారు. పూజలు అనంతరం విద్యార్థులు పోతురాజు, పోలేరమ్మ, మారెమ్మ, అంకాలమ్మ వేషధారణలో అలరించారు. బాలికలు, ఉపాధ్యాయినిలు బోనాలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్